సాక్షి అనకాపల్లి

శుక్రవారం । 11 । ఏప్రిల్ । 2025



ఈదురు గాలుల బీభత్సం 8లో

జిల్లాలో ఈదురుగాలుల వల్ల ఒకపక్క మామిడి, జీడిమామిడి నేల రాలగా.. మరోపక్క మంటలు వ్యాపించి బెల్లం రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది.



ఫ్లైఓవర్ వద్దే వద్దు 8లో

అచ్యుతాపురం కూడలిలో ఏర్పాటు చేయతలపెట్టిన ఫ్లైఓవర్ వద్దని, రింగు రోడ్డు వేయాలని ప్రజలు ప్రజాభిప్రాయ సేకరణలో స్పష్టం చేశారు.



సింహగిరిపై పండిత సదస్సు

అప్పన్న కల్యాణోత్సవాల్లో భాగంగా గురువారం పండిత సదస్సు ఘనంగా జరిగింది. దేవస్థానం తరఫున పండితులను సత్కరించారు. 8లో

నాకు కన్ను కనిపించదు.. సర్కారుకు గోడు వినిపించదు



నాకు ఒక కన్ను పూర్తిగా కనిపించదు. 2019లో వికలాంగ పింఛన్ మంజూరైంది. 2024 జూన్ వరకు పెన్షన్ వచ్చింది. కొత్త ప్రభుత్వం వచ్చిన తరువాత పింఛన్ నిలిపివేశారు. పలుసార్లు మండల, డివిజన్ స్థాయి అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదు.

–నల్లబెల్లి వరలక్ష్మి, పాకలపాడు, గొలుగొండ మండలం

కోర్టులోనే న్యాయం జరగాలి



నాకు వెన్నుపూస సమస్య ఉంది. నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో చికిత్స అందించారు. వికలాంగుల సర్టిఫికెట్ దాఖలు చేయగా నాకు పింఛన్ మంజూరయింది. గత ఏడాది జూన్ వరకు పింఛన్ అందుకున్నాను. కూటమి ప్రభుత్వం వచ్చాక నా పెన్షన్ ఆగిపోయింది. దీనిపై కోర్టును ఆశ్రయించాను. నాలాంటి దీనురాలి పెన్షన్ తొలగించడం అన్యాయం.

– నల్లబెల్లి రాజేశ్వరి, పాకలపాడు, గొలుగొండ మండలం

మంచానికే పరిమితం



నాకు కాలు, చేయి పనిచేయదు. గత ప్రభుత్వం పింఛన్ మంజూరు చేసింది. దీంతో జీవనం సాగించేదానిని. కొత్త ప్రభుత్వం వచ్చాక రెండు నెలలు మాత్రమే పింఛన్ ఇచ్చి, తరువాత నిలిపివేశారు. అధికారులను అడిగితే సరైన సమాధానం ఇవ్వడం లేదు. చాలా ఇబ్బందులు పడుతున్నాను.

–బంగారు అచ్చియ్యమ్మ, పాకలపాడు, గొలుగొండ మండలం

వైఎస్సార్‌సీపీకి ఓటు వేశానని..



నా వయస్సు 70 ఏళ్లు. ఆరేళ్లుగా వృద్ధాప్య పింఛను అందుకుంటున్నాను. వైఎస్సార్‌సీపీకి ఓటు వేశానని టీడీపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే నా పింఛను తీసేశారు. అధికారులను అడిగితే వస్తాయని చెబుతున్నారు. ఎమ్మార్వో, ఆర్డీవో, కలెక్టర్ కార్యాలయాలకు వెళ్లి అర్జీలు ఇచ్చాను. కానీ ఫలితం లేదు.

– శ్రీరామ్మూర్తి, వెంకటాపురం, గొలుగొండ మండలం

■ ప్రతి నెలా పెన్షన్ టెన్షన్

రాజకీయం.. అమానవీయం

పాలకులు ప్రజలను కన్నబిడ్డల్లా చూసుకోవాలి. వారి యోగక్షేమాలు తెలుసుకొని సమస్యలు పరిష్కరించాలి. రాజకీయాలకు, రాగద్వేషాలకు అతీతంగా వ్యవహరించాలి. అప్పుడే అది ప్రజా ప్రభుత్వం. తమకు ఓటు వేయలేదనో, ప్రతిపక్ష పార్టీ సానుభూతిపరుడనో కక్ష కట్టి నిబంధనలకు విరుద్ధంగా పెన్షన్లు తొలగించినా, ఇబ్బందులు పెట్టినా అది ప్రజా కంటక ప్రభుత్వం. కూటమి సర్కారు వచ్చాక జనం అలాంటి చేదు అనుభవాలను ఎదుర్కొంటున్నారు. దివ్యాంగులు, వృద్ధాప్యంతో బాధ పడుతున్నవారు, రాజకీయాలకు దూరంగా బతికే సామాన్యులను సైతం అధికార పార్టీ ప్రతినిధులు వదిలిపెట్టడం లేదు. లబ్ధిదారుల సంఖ్యను తగ్గించడమే ఏకైక లక్ష్యంగా.. వేధింపులే ఆదర్శంగా.. పింఛన్లను నిలిపివేస్తున్నారు. అధికారంలోకి వచ్చిన 10 నెలల్లోనే 10,136 పింఛన్లకు కోత పెట్టడమే ఇందుకు ఉదాహరణ.



పింఛన్ వంచన

- లబ్ధిదారుల సంఖ్యకు కత్తెర వేయడమే లక్ష్యం
- వృద్ధులు, వికలాంగులు అన్న జాలి లేదు
- వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులే టార్గెట్‌గా ఏరివేత
- వైఎస్సార్‌సీపీ మద్దతు సర్పంచ్ తమ్ముడి పింఛను తొలగింపు
- డోలీ మోతతో నిరసన తెలిపాడని మరొకరి పింఛన్ కట్
- మళ్లీ ధ్రువపత్రాలు తెచ్చుకోవాలని దివ్యాంగులకు వేధింపులు
- 10 నెలల కూటమి పాలనలో ఏకంగా 10,136 పింఛన్లకు కోత



దుర్గునాయుడు



ఆనంద్

వీరిద్దరినీ చూడండి.. వైఎస్సార్‌సీపీ సర్పంచ్ తమ్ముడని రావికమతం మండలం చినపాచిలి గ్రామానికి చెందిన కోమర దుర్గునాయుడు వికలాంగ పింఛన్ కట్ చేశారు. జనవరి నుంచి పెన్షన్ అందడం లేదని భార్యతో కలిసి మూడు రోజుల క్రితం పీజీఆర్ఎస్‌లో ఆయన కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. తమ గ్రామానికి రోడ్డు లేక డోలీని ఆశ్రయించాల్సి వస్తుందని పేర్కొంటూ నిరసన కార్యక్రమంలో పాల్గొన్నాడని రోలుగుంట మండలానికి చెందిన గెమ్మిలి ఆనంద్ అనే ఒక గిరిజన దివ్యాంగుడి పింఛన్ సైతం నిలిపివేశారు. సమస్యను వివరించడమే అతను చేసిన పాపం. పెన్షన్ ఇవ్వకపోతే నలుగురు పిల్లలతో బతకడం ఎలా అంటూ ఆయన సైతం ఈనెల 7న కలెక్టరేట్‌లో అర్జీ సమర్పించాడు. వీరే కాదు.. జిల్లా అంతటా ఇలాంటి బాధితులు వేలాదిమంది ఉన్నారు.

సాక్షి, అనకాపల్లి:

సామాజిక పింఛన్లు సామాన్యులను, నిస్సహాయులను ఆదుకుంటాయి. వారి జీవనానికి కాసంత ఊతమిస్తాయి. వృద్ధులు, దివ్యాంగులు, వ్యాధిగ్రస్తులు, ఒంటరి మహిళలు ప్రతి నెల ఒకటో తేదీన అందే పింఛన్ కోసం కళ్లు కాయలు కాసేలా ఎదురుచూస్తారు. కనీస ధర్మాన్ని విస్మరించి, కనికరం లేకుండా, వారి నుంచి రాజకీయ లబ్ధి పొందేందుకు, ప్రతిపక్ష పార్టీల వారిపై కక్ష తీర్చుకునేందుకు ప్రయత్నించడం ఎంత వరకు న్యాయం. వారి కన్నీళ్లను, గుండెల్లో వేదనను అర్థం చేసుకోవడం మాని కూటమి సర్కారు ఏర్పడ్డాక 10 నెలల కాలంలో 10,136 మంది పింఛన్లకు కోత విధించారు. కొత్త ప్రభుత్వం అధికారం చేపట్టిన తొలి నెల నుంచే పింఛను వంచన ప్రారంభమైంది. ఇప్పటికీ కొనసాగుతూ ఉంది. ఇప్పుడే కాదు.. గతంలో చంద్రబాబు సీఎంగా ఉండగా అవ్వాతాతల విషయంలో ఎలా వ్యవహరించారో అందరికీ తెలిసిందే. ఆనాటి జన్మభూమి కమిటీల పెత్తనాన్ని తలచుకొని ఇప్పటికీ సామాన్య జనం వణికిపోతుంటారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉండగా గత ఏడాది ఏప్రిల్ నెలలో జిల్లాలో 2,66,208 మంది పింఛనుదారులు ఉండగా ఇప్పుడు ఆ సంఖ్య 2,56,072కు పడిపోయింది. తగ్గిన 10,136 పింఛన్లలో సగం మరణించిన వారివి అనుకున్నా.. మిగతా పెన్షన్ల మాటేమిటి?

పాత వాటికి పాతర.. కొత్త వాటికి లేదు అక్కర..

వైఎస్సార్‌సీపీ హయాంలో ఏడాదికి రెండు సార్లు కొత్త పింఛన్లు ఇచ్చేవారు. ప్రతి ఏటా జనవరి, జూలై నెలల్లో అర్హులైన వారందరికీ కొత్త పింఛన్లను అందించేవారు. రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా లబ్ధిదారులను ఎంపిక చేశారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకుంటే చాలు.. వలంటీర్లు ఇంటి వద్దకే వెళ్లి మంజూరు పత్రం అందజేసిన పరిస్థితులు ఉండేవి. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 10 నెలలు దాటింది. ఇంతవరకూ కొత్త పింఛన్ల ఊసే లేదు. ఉన్నవి కొనసాగితే చాలన్న పరిస్థితులు ఉన్నాయి. ఏదో ఒక సాకు చెప్పి తొలగిస్తున్నారు. అర్జీ పెట్టుకుంటే అధికారులు సైతం సమాధానం చెప్పలేక సతమతమవుతున్నారు. కూటమి నేతలు ఒకపక్క పింఛన్ సొమ్ము పెంచినట్టు గొప్పలు చెప్పుకుంటూ.. మరోపక్క అర్హత ఉన్న లబ్ధిదారులను సైతం తొలగిస్తూ రాక్షసానందం పొందుతున్నారు.

అయ్యన్న ఇలాకాలో..

స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రాతినిధ్యం వహిస్తున్న నర్సీపట్నం నియోజకవర్గంలోని గొలుగొండ మండలం పాకలపాడు పంచాయతీలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత 28 మంది పింఛన్లు తొలగించారు. కేవలం వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులనే నెపంతో వాటిని నిలిపివేశారు. వీరిలో 19 మంది వికలాంగులు, 9 మంది వృద్ధులు ఉన్నారు. ఆ గ్రామంలో తొలగింపునకు గురైన వృద్ధులు, వికలాంగులు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగే పీజీఆర్ఎస్‌లో కలెక్టర్, జేసీలకు.. అలాగే ఆర్డీవో, ఎమ్మార్వోలకు తమ పింఛన్లు పునరుద్ధరించాలని వినతిపత్రం అందజేశారు. ఎందుకు తమ పింఛన్లు తొలగించారో చెప్పాలని డిమాండ్ చేశారు. అర్హతున్నా ఎందుకు పింఛన్లు తొలగించారని ప్రశ్నిస్తే..మూడు నెలలుగా పింఛన్లు తీసుకోవడానికి రావడం లేదనే తొలగించామని అధికారులు చెప్పారు.

వారిలో కొందరు..

- పాకలపాడు పంచాయతీ పాకలపాడు గ్రామంలో వికలాంగులు పోతల అమ్మాజీ, పోలిరెడ్డి శ్రీధర్, వార లక్ష్మి, బంగారు అచ్చియ్యమ్మ, నల్లమిల్లి రాజేశ్వరి, రుత్తల నూకరాజు (దీర్ఘకాలిక సమస్యలు), ఇదే పంచాయతీలో మరో శివారు గ్రామమైన వెంకటాపురంలో వికలాంగులు పోతల నాగలక్ష్మి, సర్వసుద్ధి సింహాచలం, వృద్ధులు పోతల శ్రీరామ్మూర్తి, మేడపరెడ్డి అక్కినాయుడు, రొంగల సత్తిబాబు, సర్వసుద్ధి పెద అప్పలరాజు, చప్పా రాజుబాబు, యాళ్ల సూరిబాబుల పింఛన్లు తొలగించారు.

రాజకీయ కక్షతోనే..



నాకు పుట్టుక నుంచి ఒక కన్ను లేదు. 18 ఏళ్లుగా వికలాంగుల పింఛన్ తీసుకుంటున్నాను. వికలాంగుల సర్టిఫికేట్ కూడా ఉంది. కేవలం రాజకీయ కక్షతో వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులమనే నెపంతోనే తన పింఛను తొలగించారు. మా మండలం నుంచి కలెక్టరేట్ వరకు అందరు అధికారులకు విన్నవించుకున్నాను. పింఛను ఇస్తామన్నారు గానీ పరిష్కారం కాలేదు.

–త్రినాథ, పాకలపాడు, గొలుగొండ మండలం

అధికారులు సమాచారం ఇవ్వడం లేదు



కంటి చూపు నరాల సమస్యతో ఉన్నప్పుడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నాకు వికలాంగుల సర్టిఫికెట్ వచ్చింది. దీని ఆధారంగా పింఛన్ మంజూరైంది. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత నెల రోజులకే నా పింఛన్ నిలిపేశారు. వైఎస్సార్‌సీపీకి సానుభూతిపరురాలు అని ముద్ర వేసి ఇబ్బందులు పెడుతున్నారు. అధికారులను అడిగితే సమాచారం ఇవ్వడం లేదు.

–పోతల అమ్మాజీ, పాకలపాడు, గొలుగొండ మండలం



న్యూస్‌రీల్

సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ రాక నేడు

నర్సీపట్నం: సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ శుక్రవారం నర్సీపట్నం వస్తున్నారు. 'రాజ్యాంగ రక్షణ–లౌకికవాదం పరిరక్షణ' అంశంపై సీపీఐ నిర్వహిస్తున్న సదస్సులో ఆయన పాల్గొంటారు. పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణమూర్తి కూడా ఈ సదస్సుకు హాజరవుతున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ తెలిపారు.

టెన్త్ మూల్యాంకనం పూర్తి



డీఈవో అప్పారావునాయుడిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

అనకాపల్లి టౌన్: జిల్లాలోని మూడు కేంద్రాలలో నిర్వహించిన పదో తరగతి పబ్లిక్ పరీక్షల మూల్యాంకనం పూర్తయిందని జిల్లా విద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావునాయుడు తెలిపారు. ప్రభుత్వ నిబంధనలు, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పకడ్బందీగా వాల్యుయేషన్ ప్రక్రియ నిర్వహించామన్నారు. పరీక్షలు సజావుగా సాగడానికి సహకరించిన కలెక్టర్, ఎస్పీ, ప్రభుత్వ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్, విద్యాశాఖాధికారులు, చీఫ్ ఎగ్జామినర్లు, అసిస్టెంట్ ఎగ్జామినర్లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

సంప్రదాయ విధానంలో మామిడి పండ్లను మగ్గబెట్టాలి

- రైతులు, వ్యాపారులకు అవగాహన కల్పించాలి
- జేసీ జాహ్నవి ఆదేశం

8లో

ఏఐలో చరణ్‌తేజ్ ప్రతిభ

- జేఈఈ స్కోర్ లేకుండానే ఐఐటీ హైదరాబాద్‌లో సీటు



చరణ్‌తేజ్

యలమంచిలి రూరల్: యలమంచిలి మున్సిపాలిటీ పరిధి పెదపల్లికి చెందిన జెర్రిపోతుల చరణ్‌తేజ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డాటా సైన్స్ కోర్సుల్లో ప్రవేశాల కోసం జాతీయ పరీక్ష నిర్వహణ సంస్థ (ఎన్‌టీఏ) నిర్వహించిన ప్రవేశ పరీక్షలో మెరిశాడు. ఆన్‌లైన్ విధానంలో నిర్వహించిన ఈ పరీక్షలో రెండు దశల్లో చరణ్‌తేజ్ ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రంలో ఐఐటీలో సీటు సాధించిన 20 మంది విద్యార్థుల్లో ఒకరిగా నిలిచాడు. ఈ ఏడాది నుంచి దేశవ్యాప్తంగా ఐఐటీల్లో కొన్ని ఇంజనీరింగ్ కోర్సుల్లో ఐఐటీ జేఈఈ స్కోర్ లేకుండానే విద్యార్థులకు ప్రవేశాలు కల్పించాలని నిర్ణయించారు. దీనిలో భాగంగా ఎన్‌టీఏ నిర్వహించిన ప్రవేశ పరీక్షలో ప్రతిభ చూపిన జెర్రిపోతుల చరణ్‌తేజ్‌కు ఐఐటీ హైదరాబాద్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డాటా సైన్స్ ఏడాది సర్టిఫికెట్ కోర్సులో ప్రవేశం లభించింది. ఈ విధానం ద్వారా దేశవ్యాప్తంగా రెండు వేలమందికి వివిధ ఐఐటీల్లో ప్రవేశాలు కల్పిస్తున్నారు. తనకు ఐఐటీ హైదరాబాద్‌లో సీటు దక్కడం పట్ల చరణ్‌తేజ్ ఆనందం వ్యక్తం చేశాడు. కోర్సు పూర్తి చేసి ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో మంచి ఉద్యోగం సాధించాలన్నదే తన లక్ష్యమని సాక్షికి తెలిపాడు. చరణ్‌తేజ్ తండ్రి నాగేశ్వర్రావు వివిధ మీడియా సంస్థల్లో జర్నలిస్టుగా పనిచేశారు. ఈ సందర్భంగా చరణ్‌తేజ్‌ను పలువురు అభినందించారు.

అనిత ఒక ఫెయిల్యూర్ హోంమంత్రి

- మహిళలపై అఘాయిత్యాలు నియంత్రించలేని అసమర్థురాలు
- మాజీ సీఎం వైఎస్ జగన్‌పై దూషణలు ఆపి పాలనపై దృష్టి పెడితే మంచిది
- వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మచ్చ నాగ మల్లీశ్వరి సూచన



మీడియాతో మాట్లాడుతున్న మచ్చ నాగ మల్లీశ్వరి

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్ర హోంమంత్రిగా వంగలపూడి అనిత విఫలమయ్యారని, ఉమ్మడి విశాఖలో మహిళలు, బాలికలపై లైంగిక దాడులు, అఘాయిత్యాలు జరిగితే నియంత్రించలేని అసమర్థురాలిగా మిగిలిపోయారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మచ్చ నాగ మల్లీశ్వరి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది తాను చెబుతున్న మాట కాదని.. కూటమి ప్రభుత్వంలో డిప్యూటీ సీఎంగా ఉన్న పవన్ కల్యాణ్ స్వయంగా చెప్పిన మాట అని గుర్తు చేశారు. హోంమంత్రి ఒక దళిత ఐపీఎస్‌ను వేధిస్తున్న పరిస్థితులు చూస్తున్నామన్నారు. మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. మంత్రి అనిత రాష్ట్రంలో శాంతి భద్రతలపై దృష్టి సారించకుండా.. మా నాయకుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై విమర్శలు చేయడమే పనిగా పెట్టుకుందంటూ మండిపడ్డారు. రాష్ట్రంలో 16,800 మంది మహిళలపై అఘాయిత్యాలు, లైంగిక వేధింపులు జరిగినట్లు హోం మంత్రి అనిత శాసనసభలో చెప్పారని, అంటే సగటున గంటకు ముగ్గురిపై అఘాయిత్యాలు జరుగుతున్నాయన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో వరుసగా మహిళలపై లైంగిక దాడులు, హత్యలు జరుగుతుంటే.. హోం మంత్రి కనీసం బాధిత మహిళలను పరామర్శించి ధైర్యం చెప్పలేదని, ఆమె షాపింగ్‌మాల్స్ ప్రారంభోత్సవాలకే పరిమితమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళల రక్షణ కోసం గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన దిశ యాప్‌ను శక్తి యాప్‌గా పేరు మార్చి.. ఏదో సాధించినట్టు గొప్పలకు పోతున్నారని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా రాష్ట్రంలో శాంతిభద్రతలపై దృష్టి సారించాలని హితవు పలికారు.

రైతుల ఆకలి కేకలు వినిపించడం లేదా?

- చోడవరం సుగర్ ఫ్యాక్టరీ రైతులకు పేమెంట్లు లేవు
- ఉపాధి కూలీలకు 75 రోజులుగా వేతనాలు చెల్లించడం లేదు
- శాసనమండలి ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ ధ్వజం



మీడియాతో మాట్లాడుతున్న బొత్స సత్యనారాయణ. చిత్రంలో మాజీ మంత్రులు అమర్‌నాథ్, కారుమూరి నాగేశ్వరరావు

సాక్షి, విశాఖపట్నం:

ముఖ్యమంత్రి చంద్రబాబుకు రైతులన్నా.. పేదలన్నా చులకన భావమని శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. పది నెలల పాలనలో రైతుల ఆకలి కేకలు వినిపించడంలేదా? అని చంద్రబాబును ప్రశ్నించారు. చోడవరం సుగర్స్ రైతుల సమస్యలు, ఉపాధి కూలీల వేతనాల సమస్యలను గాలికొదిలేసి.. వైఎస్సార్ సీపీ నేతలపై దూషణలకు, వారిపై అక్రమ కేసులు పెట్టి వేధించడమే పనిగా పాలన సాగిస్తున్నారంటూ మండిపడ్డారు. లాసన్స్‌బేకాలనీలోని తన క్యాంప్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం పది నెలల పాలనలో రాష్ట్రంలో ఏ వర్గం సంతోషంగా లేదన్నారు. చోడవరం సుగర్ ఫ్యాక్టరీలో లక్ష టన్నులకు పైగా క్రషింగ్ నిలిచిపోయిందని, రైతులకు నేటికీ డబ్బు చెల్లించలేదన్నారు. రైతులకు డబ్బులు ఇవ్వకపోగా.. క్రషింగ్‌ను కూడా నిలిపివేస్తుంటే కూటమి ప్రభుత్వం నిద్రపోతుందా అంటూ మండిపడ్డారు. తక్షణమే కార్మికులకు, ఉద్యోగులకు జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. 75 రోజులుగా ఉపాధి కూలీలకు వేతనాలు చెల్లించకుండా ఈ ప్రభుత్వం బకాయి పెట్టిందని మండిపడ్డారు.

గతంలో ఏ ప్రభుత్వం కూడా 75 రోజుల ఉపాధి వేతనాలను ఆపిన సందర్భాలు లేవన్నారు. కష్టపడ్డ వారికి కూలి డబ్బులు ఇవ్వకుండా నిలిపివేస్తే.. రాష్ట్రంలో పేదలు ఎలా బతకాలని ప్రశ్నించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధి కూలీలకు రూ.700 కోట్లు ఇవ్వాల్సి ఉందని, వేతనాలు ఇవ్వాలని ఉపాధి కూలీలు కూడా నిరసనలు తెలియజేస్తున్నారన్నారు. తక్షణమే వారి వేతనాల విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చేస్తే సరిపోదని, ఏ హామీలైతే ఇచ్చారో అవన్నీ నెరవేర్చాలని బొత్స డిమాండ్ చేశారు. సమావేశంలో మాజీ మంత్రులు కారుమూరి నాగేశ్వరరావు, గుడివాడ అమర్‌నాథ్ పాల్గొన్నారు.

ముగిసిన 'గోవాడ' క్రషింగ్

- లక్ష్యం చేరుకోలేక చతికిలపడ్డ వైనం
- సీజన్ పూర్తయినా ఒక్క పైసా కూడా సాయం చేయని ప్రభుత్వం

చోడవరం: గోవాడ సుగర్ ఫ్యాక్టరీ క్రషింగ్ ముగిసింది. ఈ ఏడాది క్రషింగ్ సీజన్‌ను గురువారం ఉదయంతో ముగించినట్టు యాజమాన్యం ప్రకటించింది. ఫ్యాక్టరీ పరిధిలో ఈ ఏడాది చెరకు సాగు విస్తీర్ణం బాగా తగ్గిపోవడంతో కేవలం లక్షా 50 వేల టన్నులు క్రషింగ్ చేయాలనే లక్ష్యంతో గానుగాటను ప్రారంభించారు. క్రషింగ్ ప్రారంభంలోనే సమస్యలు తలెత్తడంతో ప్రతి ఏటా డిసెంబరు మొదటి వారంలో ప్రారంభమయ్యే క్రషింగ్‌కు ఈ ఏడాది జనవరి మూడో వారంలో శ్రీకారం చుట్టారు. బెగాస్, బాయిలర్ హౌస్‌లో మరమ్మతులు, ఇతరత్రా సమస్యలతో తరుచూ క్రషింగ్‌కు అంతరాయం ఏర్పడింది. చివరికి సీజన్ మొత్తానికి లక్షా 9 వేల టన్నులు క్రషింగ్ చేసి సీజన్‌ను ముగించారు. క్రషింగ్ జరుగుతుండగానే టన్నుకి రూ.3 వేల చొప్పున రైతులకు చెల్లింపులు చేయడం క్రషింగ్ ఈ మేరకైనా జరగడానికి దోహదపడింది. రికవరీ మాత్రం గతంలో ఎప్పుడూ లేనంత ఘోరంగా పడిపోయింది. గతంలో సీజన్ ముగించే నాటికి సరాసరి 9 శాతం ఉండేది. కానీ ఈ ఏడాది కనీసం 7 శాతం కూడా వచ్చే అవకాశాలు కనిపించలేదు. పూర్తిగా పంచదార ఉత్పత్తి జరిగితే ఎంత మేర రికవరీ వచ్చిందనేది తెలుస్తుంది. ముగింపు నాటికి 1.9 లక్షల టన్నులు క్రషింగ్ చేయగా 57 వేల క్వింటాళ్ల పంచదారను ఉత్పత్తి చేశారు. చివరి రోజుల్లో చేసిన క్రషింగ్‌కు సంబంధించి ఇంకా పంచదార ఉత్పత్తి ప్రాసెసింగ్‌లో ఉంది.

ఈ సీజన్‌లో రైతులు రోడ్డెక్కి ఆందోళనలు చేసినట్లు మరెప్పుడూ జరగలేదు. గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఐదేళ్లలో సుమారు రూ.89 కోట్లు సాయం చేయగా ఈ ఏడాది కూటమి ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా సాయం చేయకపోవడంతో ఫ్యాక్టరీ ఆర్థికంగా దివాలా తీసింది. చివరికి ఓవరాయిలింగ్ పనుల్లో కావలసిన యంత్ర పరికరాలను కూడా కొనుక్కోలేని పరిస్థితిలో ఫ్యాక్టరీ ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయింది.

క్లుప్తంగా

డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

తుమ్మపాల : డీఎస్సీ ఉచిత శిక్షణ కొరకు జిల్లాకు చెందిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్టు వెనుకబడిన తరగతుల సంక్షేమం, సాధికారత అధికారి కె.రాజేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో అర్హత గల బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ విద్యార్థులకు మెగా డీఎస్సీ పరీక్ష కోసం ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ అతిత్వరలో అందించబడుతుందని తెలియజేశారు. టెట్ అర్హత సాధించిన ఆసక్తి గల అర్హులైన బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులను కోరడమైందన్నారు. అభ్యర్థులు కుల ధృవీకరణ పత్రం, నేటివిటీ, ఆదాయ ధ్రువీకరణ పత్రం, టెట్ పరీక్షలో అర్హత పత్రాలను జతపరచిన దరఖాస్తును వెనుకబడిన తరగతుల సంక్షేమం – సాధికారత అధికారి కార్యాలయం, డోర్ నెం.10-06-31/7, రఘురామకాలనీ, సర్వేపల్లి రాధా కృష్ణన్ జూనియర్ కాలేజీ స్ట్రీట్‌లో సమర్పించాలని తెలిపారు. ఇతర వివరాలకు ఫోన్ నెం.9885845743, 9494978777 సంప్రదించవలసినదిగా ఆమె కోరారు.

ప్రజాదర్బార్‌లో వినతుల స్వీకరణ



ప్రజాదర్బార్‌లో వినతులు స్వీకరిస్తున్న మంత్రి అనిత

నక్కపల్లి : హోం మంత్రి వంగలపూడి అనిత గురువారం సారిపల్లిపాలెంలోని తన స్వగృహంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తగా పింఛన్లు మంజూరు చేయాలని, రేషన్ కార్డులు మంజూరు చేయాలని, భూ సరిహద్దు సమస్యలు, పట్టాదారు పాసు పుస్తకాల సమస్యలు పరిష్కరించాలని, స్వయం ఉపాధి కోసం రుణాలు ఇప్పించాలంటూ నాలుగు మండలాల నుంచి పలువురు అర్జీలు అందజేశారు. అర్జీలు పరిష్కారానికి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసి పరిష్కరిస్తామన్నారు. సుమారు 600కు పైగా అర్జీలు వచ్చాయని తెలిపారు.

ఈదురు గాలుల బీభత్సం



తెనుగుపూడిలో రోడ్డుకు అడ్డంగా కూలిన చెట్టును తొలగిస్తున్న ఉప సర్పంచ్ పెదనాయుడు

- వెంకటరాజుపురంలో బెల్లం తయారీ పాక దగ్ధం
- రూ.2 లక్షల మేర ఆస్తి నష్టం
- చోడవరంలో నేల రాలిన మామిడి





దగ్ధమైన బెల్లం దిమ్మలను పరిశీలిస్తున్న బాధిత రైతులు, (ఇన్‌సెట్) వెంకటరాజుపురంలో దగ్ధమైన బెల్లం పాక

దేవరాపల్లి : మండలంలో గురువారం సాయంత్రం ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి. వెంకటరాజుపురంలో బెల్లం పాకకు నిప్పు అంటుకోవడంతో రెండు పెనాల్లోని మరుగుతున్న చెరకు రసంతో పాటు పాకలో భద్ర పరిచిన 80 బెల్లం దిమ్మలు అగ్నికి ఆహుతయ్యాయి. గురువారం సాయంత్రం వర్షం కురుస్తుండడంతో బయట ఆరబెట్టిన చెరకు పిప్పిని పాకలోకి తీసుకెళ్తుండగా, ఈదురు గాలుల బీభత్సానికి బెల్లం తయారు చేస్తున్న పొయ్యి నుంచి నిప్పు రవ్వలు ఎగిరిపడి బెల్లం పాక కాలి బూడిదయ్యింది. ఈ ప్రమాదంలో సుమారు రెండు లక్షల రూపాయల మేర నష్టం జరిగిందని బాధిత రైతులు వనుం గంగమ్మ, రామునాయుడు, అబద్దం, శ్రీను, పెనగంటి సింహాచలంనాయుడు, లెక్కల రమణ వాపోయారు. ఈదురు గాలుల ధాటికి తెనుగుపూడి ప్రధాన కూడలిలో రోడ్డుకు అడ్డంగా చెట్లు పడిపోవడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఉప సర్పంచ్ కాటిపాం పెదనాయుడు జోరు వర్షంలోనే చెట్లు తొలగించి రాకపోకలకు అంతరాయం లేకుండా చేశారు. తారువ ఫీడర్ పరిధిలో చెట్టు కొమ్మలు విద్యుత్ తీగలపై పడడంతో విద్యుత్ సరఫరాకు కొద్ది సేపు అంతరాయం ఏర్పడగా, యుద్ధప్రాతిపదికన చెట్ల కొమ్మలను తొలగించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించినట్టు విద్యుత్ ఏఈఈ కె.శంకరరావు తెలిపారు.

నేలరాలిన మామిడి

చోడవరం : మామిడి, జీడిమామిడి పంటలకు దెబ్బమీద దెబ్బ తగిలింది. పంట పక్వానికి వచ్చిన సమయంలో గురువారం ఒక్కసారిగా ఈదురు గాలులతో కూడిన అకాల వర్షం కురవడంతో పంట చాలా మేర దెబ్బతింది. చోడవరం నియోజకవర్గంతోపాటు పరిసర ప్రాంతాల్లో సుమారు 20వేల ఎకరాల్లో మామిడి సాగు జరుగుతుంది. ఈ ఏడాది మొదట్లో పూత బాగా వచ్చినప్పటికీ వర్షాలు కురవకపోవడంతో పొగమంచు కమ్ముకుంది. మంచు వల్ల చాలామేర పూత రాలిపోయింది. ఆలస్యంగా పిందెలు వచ్చాయి. 50శాతమే ఇప్పుడు తోటల్లో కాయలు ఉన్నాయి. కనీసం ఆ పంటైనా చేతికి వస్తే పెట్టుబడులైనా వస్తాయని ఆశించిన రైతులకు అకాల వర్షం నష్టం చేకూర్చింది. పెద్ద ఎత్తున గాలులు వీయడంతో చోడవరం, అనకాపల్లి, మాడుగుల, దేవరాపల్లి, కె.కోటపాడు, బుచ్చెయ్యపేట ప్రాంతాల్లో మామిడికాయలు నేలరాలిపోయింది. గాలులు గట్టిగా వీయడంతో నేల రాలిన కాయలన్నీ పగిలి పోయాయి.



నేల రాలిపోయిన కాయలను తోటలో కుప్పలుగా పోసిన రైతు

బుచ్చెయ్యపేట : మండలంలో గురువారంసాయింత్రం నాలుగు గంటల ప్రాంతంలో ఉరుములు, మెరుపులతో గాలివర్షం కురిసింది. గాలులు బలంగా వీయడంతో పలు గ్రామాల్లో చెట్టు కొమ్మలు విరగి పడగా జీడిమామిడికాయలు నేలరాలాయి. దీంతో జీడిమామిడి రైతులకు తీవ్ర నష్టం జరిగింది.

పెట్టుబడి కూడా పోయింది



నేను అడ్డూరు గ్రామంలో 3ఎకరాల మామిడి తోట లీజుకి తీసుకున్నాను. కాయ పెరుగుతున్న సమయంలో ఒక్కసారిగా గాలివాన వచ్చింది. చెట్లకు ఉన్న కాయంతా నేలరాలిపోయింది. సుమారు రూ.లక్షా 40వేలు పెట్టుబడి పెట్టాను. పంట చాలా వరకు రాలిపోయింది. పెట్టుబడి కూడా వచ్చేలా లేదు. మమ్మల్ని ప్రభుత్వమే ఆదుకోవాలి.

– అప్పారావు, మామిడి రైతు,అడ్డూరు

ఫ్లైఓవర్ వద్దే వద్దు ..

- ప్రత్యామ్నాయ రహదారులు ఏర్పాటు చేయాలి
- ముక్తకంఠంతో ఆర్డీవోకు అచ్యుతాపురం ప్రజల విజ్ఞప్తి



ఫ్లై-ఓవర్ వద్దంటూ ఆర్డీవోకి వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

అచ్యుతాపురం రూరల్ : అచ్యుతాపురం రోడ్డు విస్తరణలో భాగంగా మండల కేంద్రమైన అచ్యుతాపురం కూడలిలో ఏర్పాటు చేయతలపెట్టిన ఫ్లై-ఓవర్ కోసం అనకాపల్లి ఆర్డీవో షేక్ ఆయిషా గురువారం స్థానికులతో సమావేశమయ్యారు. ఫ్లై-ఓవర్ నిర్మాణానికి ప్రజలు అంగీకరిస్తే నష్టపరిహారంగా టీడీఆర్ బాండ్లు ప్రభుత్వం ఇవ్వడానికి సిద్ధంగా ఉందని తెలియజేశారు. అయితే మాకు ఫ్లై-ఓవర్ వద్దు..రింగు రోడ్డు వేయండి అంటూ స్థానికులు ముక్తకంఠంతో చెప్పారు. ఫ్లైఓవర్ నిర్మాణంతో కాలుష్యం మరింత పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రత్యామ్నాయంగా పరిశ్రమలను అనుసరించి అనేక రహదారులు ఏర్పాటు చేయడానికి అనుకూలమైన ప్రభుత్వ ఆస్తులు ఉన్నప్పటికీ కేవలం కాంట్రాక్టర్లకు లబ్ధి చేకూర్చేలా ప్రభుత్వం, అధికారులు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.

అచ్యుతాపురం కూడలిని ఆనుకుని అచ్యుతాపురం, మోసయ్యపేట, ఇందిరమ్మకాలనీ, చోడపల్లి, బర్మాకాలనీ, భోగాపురం, కుమారపురం, కోనేంపాలెం ఇలా మరెన్నో గ్రామాల్లో వేలాది మంది ప్రజలు నివాసముంటున్న నివాస స్థలాల్లో రోడ్డు మీద రోడ్డు ఏర్పాటు చేయడం ద్వారా కాలుష్యం పెరుగుతుందే కానీ అభివృద్ధి చెందదని స్పష్టం చేశారు. విశాఖ పోర్టు నుంచి వచ్చే వందలాది భారీ వాహనాలు పరిశ్రమలకు చేరుకోవడానికి అప్పన్నపాలెం కూడలి నుంచి జంగులూరు కూడలికి తరలించవచ్చునన్నారు. అలాగే యలమంచిలి హైవే నుంచి వచ్చే వాహనాలు కానీ అనకాపల్లి బైపాస్ నుంచి వచ్చే వాహనాలకు కూడా పరిశ్రమలకు చేరుకోవడానికి ప్రత్యామ్నాయ రోడ్లు ఏర్పాటు చేయడానికి ఇప్పటికే ప్రతిపాదనలో రహదారుల ప్రణాళిక ఉందని అధికారులకు గ్రామస్తులు గుర్తు చేశారు. గతంలో పరిశ్రమలకు భూములు ఇచ్చి నిర్వాసితులైన వారు వచ్చిన పరిహారంతో పూడిమడక రహదారిలో వసతి ఏర్పాటు చేసుకున్నారని, ఇప్పుడు మరోసారి అభివృద్ధి పేరుతో రోడ్ల వెడల్పు, ఫ్లై-ఓవర్ల నిర్మాణాలు చేస్తే ఎక్కడికి పోవాలని భవన యజమానులు అధికారులను నిలదీశారు.

ఫ్లైఓవర్ వద్దంటూ అనకాపల్లి ఆర్డీఓ షేక్ అయిషాకి వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో రాజాన రమేష్ కుమార్, సన్యాసినాయుడు, సర్పంచ్ కూండ్రపు విమలా నాయుడు, సీపీఎం మండల కన్వీనర్ రాము, భవన యజమానుల సంఘం అధ్యక్షుడు దేశంశెట్టి అప్పలనాయుడు, గౌరవ అధ్యక్షుడు పల్లి శేషగిరిరావు తదితరులు ఉన్నారు.

కష్టార్జితం కాలుష్యం పాలేనా...



పదేళ్లు బయట దేశాల్లో కష్టపడి సంపాదించిన కష్టార్జితంతో కుటుంబంతో స్వగ్రామంలో ప్రశాంతంగా జీవించవచ్చుననే ఉద్దేశంతో నిర్మించుకున్న ఇల్లు ప్రస్తుతం కాలుష్యం బారిన పడుతుందని తీవ్ర ఆవేదన కలుగుతోంది. ఇక్కడితో రోడ్డు వెడల్పు కాదు.. అని అధికారులు, నాయకులు చెప్పిన తరువాతే మా ఇంటి నిర్మాణం చేశాను. ఇపుడు ఫ్లై-ఓవర్ నిర్మిస్తే అంతకుఅంతా కాలుష్యం పెరిగి ఆస్పత్రుల చుట్టూ తిరగాల్సి వస్తుంది. ఇలా ఎందరో మండల కేంద్రంలో ఇళ్ల నిర్మాణాలు చేపట్టి ప్రస్తుతం దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ప్రభుత్వం, అధికారులు ఇప్పటికైనా ఫ్లై-ఓవర్ ఆలోచన మానుకుని, ప్రత్యామ్నాయ రహదారులు నిర్మాణం చేయాలి.

– పచ్చిపులుసు వాసు, అచ్యుతాపురం

మామిడి పండ్లను సంప్రదాయ విధానంలో మగ్గబెట్టాలి

- జేసీ జాహ్నవి



తుమ్మపాల: సంప్రదాయ, సురక్షిత విధానంలో మగ్గబెట్టిన మామిడి పండ్లను మాత్రమే విక్రయించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి ఆదేశించారు. జిల్లాలో 12,500 మంది రైతులు 20 వేల ఎకరాల్లో మామిడి పంటను సాగు చేస్తున్నారని, సుమారు 50 వేల మెట్రిక్ టన్నుల పంటను ఉత్పత్తి చేస్తున్నారన్నారు. ఉద్యానశాఖ అధికారులు పండ్లను మగ్గబెట్టే సురక్షిత విధానాలపై రైతులకు, వ్యాపారులకు తెలియజేయాలన్నారు. సబ్బవరం మండలం పినగాడి వద్ద గల రయిపనింగు చాంబర్లను వినియోగించుకునే విధంగా ప్రచారం చేయాలన్నారు. మానవులకు హాని కలిగించే కాల్షియమ్ కార్బైడ్ ఉపయోగించి పండ్లు మగ్గబెట్టే విధానాన్ని పూర్తిగా అరికట్టాలన్నారు. రైతులకు అవగాహన కల్పించాలని, వ్యాపారులకు కార్బైడ్ వినియోగిస్తే తీసుకునే చర్యల గురించి తెలియజేయాలని తెలిపారు. ఆహార భద్రతా శాఖ సిబ్బంది అధికంగా శాంపిల్స్ సేకరించాలని, కార్బైడ్ వాడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలియజేయాలన్నారు. జిల్లా పంచాయతీ శాఖ, మునిసిపల్ సిబ్బంది ఇందులో పాలు పంచుకోవాలని, రవాణాశాఖ సిబ్బంది మామిడి పండ్ల రవాణా వాహనాలను తనిఖీ చేయాలన్నారు. నర్సీపట్నం, పాయకరావుపేట మార్కెట్ యార్డులు, విశాఖపట్నం రైతుబజార్లలో గల రయిపెనింగు చాంబర్లను వెంటనే వినియోగంలోనికి తీసుకురావాలని మార్కెటింగ్ శాఖ అధికారులకు ఆమె ఆదేశించారు.

గుల్ల కార్మికులకు న్యాయం చేయాలి



ఆర్డీవోకు వినతి పత్రం ఇస్తున్న అఖిలపక్ష నాయకులు

నక్కపల్లి : ఏపీఐఐసీ భూసేకరణలో ఉపాధి కోల్పోయిన గుల్ల కార్మికులకు, నిర్వాసితులకు పూర్తి స్థాయిలో న్యాయం చేయాలని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. గురువారం చందనాడలో నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ చెల్లించే విషయమై ఆర్డీవో వీవీ రమణ ఆధ్వర్యంలో గ్రామ సభ జరిగింది. ఈ గ్రామసభకు నిర్వాసితుల తరపున వైఎస్సార్‌సీపీ నాయకులు వీసం రామకృష్ణ, సర్పంచ్ తళ్ల భార్గవ్, ఎంపీటీసీ గంటా తిరుపతిరావు, రైతు సంఘ నాయకుడు ఎం.అప్పలరాజు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ చందనాడలో ప్రభుత్వ భూముల్లో గుల్ల కార్మికులు బట్టీలు ఏర్పాటు చేసుకుని జీవనోపాధి పొందేవారన్నారు. ప్రభుత్వం ఈ భూములను స్వాధీనం చేసుకుందని, వారికి నష్టపరిహారం చెల్లించలేదన్నారు. డీఫారం, జిరాయితీ భూముల్లో పశువుల షెడ్లు వేసుకున్న వారికి కూడా ప్యాకేజీ వర్తింపజేయాలన్నారు. ఆ ప్యాకేజీ కింద ప్రభుత్వం ఇచ్చే రూ.8 లక్షలు సరిపోవని, కనీసం రూ.15 లక్షలు ప్యాకేజీ చెల్లించాలని, గుల్ల కార్మికులను సాగుదారులుగా గుర్తించి రూ.6.50 లక్షల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని అన్నారు. అలాగే డీఫారం భూముల్లో ఉన్న చెట్లకు నష్టపరిహారం చెల్లించకపోవడం అన్యాయమన్నారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రైతులకు, నిర్వాసితులకు, గుల్లకార్మికులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంతో తహసీల్దార్ నర్సింహమూర్తి పాల్గొన్నారు.

మరో 30 ఎకరాల్లో సరుగుడు తోటల దగ్ధం



చింతపాకలో కాలిపోయిన సరుగుడు తోటల వద్ద విచారం వ్యక్తం చేస్తున్న గొంప రైతులు

బుచ్చెయ్యపేట : చింతపాక గ్రామంలో మరో 30 ఎకరాల్లో సరుగుడు తోటలు కాలిపోయాయి. బుధవారం మధ్యాహ్నం జరిగిన అగ్ని ప్రమాదంలో గ్రామానికి చెందిన 80 మంది రైతులకు చెందిన 50 ఎకరాల సరుగుడు తోటలు కాలిపోగా సుమారు కోటిన్నర రూపాయలు రైతులకు ఆస్తి నష్టం జరిగింది. రావికమతం మండలం గొంప గ్రామానికి చెందిన రైతులకు చింతపాక రెవిన్యూలో భూములున్నాయి. అగ్ని ప్రమాదం జరిగినట్టు తెలిసి గురువారం రైతులు తమ పొలాల్లోకి వెళ్లి చూడగా వీరి సరుగుడు తోటలు కూడా కాలిపోయినట్టు గుర్తించారు. గొంప గ్రామానికి చెందిన పసుపులేటి సంజయ్, నాగరాజు, నాయుడు, శ్రీను, పెంటారావు, సత్తిబాబు, నరసమ్మ, కన్నంనాయుడు, సతీష్ తదితర రైతులకు చెందిన 30 ఎకరాల్లో తోటలు కాలిపోయాయి. సుమారు రూ.90 లక్షలు ఆస్తి నష్టం జరిగినట్టు బాధిత రైతులు వాపోతున్నారు. చింతపాక రెవిన్యూలో భూములండడంతో నష్టాన్ని గుర్తించి పరిహారం అందేలా అధికారులు చూడాలని బాధిత రైతులు కోరుతున్నారు.

ఇంటి పునాదుల ధ్వంసంపై ఫిర్యాదు



భోగాపురంలో దొరబాబు ఇంటి నిర్మాణ పునాదులు ధ్వంసం చేస్తున్న ఆక్రమణదారులు

రోలుగుంట : భోగాపురం గ్రామంలో కాలనీ దగ్గర ప్రభుత్వం ఇచ్చిన భూమిలో లబ్ధిదారుడు పరవాడ దొరబాబు ఇంటి నిర్మాణం చేపట్టాడు. దీనిని సమీపంలో గల కొందరు దౌర్జన్యం చేసి ఇంటి నిర్మాణం చేయకుండా పునాదులు తవ్వి ధ్వంసం చేశారు. అంతే కాకుండా తనపై దాడికి దిగుతున్నారని, తనకు వారి నుంచి రక్షణ కల్పించాలని బాధితుడు దొరబాబు జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్‌కు ఫిర్యాదు చేశారు. వివరాలివి. రోలుగుంట మండలం కంచుగుమల పంచాయతీ శివారు భోగాపురం గ్రామంలో దివంగత తహసీల్దార్ పెంటకోట అప్పలనాయుడు సర్వే నెంబరు 13/సి ప్లాట్ నెంబరు 37లో ఇంటి స్థలాన్ని 2015లో ఇచ్చారు. ఈ స్థలంలో దొరబాబు గృహనిర్మాణం చేపట్టగా సమీపంలో ఉన్న నక్కా రాజు, అప్పారావు, వెంకటరమణ దౌర్జన్యంగా వచ్చి నిర్మాణాన్ని ఆపేయాలని పునాదులు తవ్వి ధ్వంసం చేశారు. ఈ స్థలం నీది కాదని, తప్పుడు పేర్లతో 20 ఏళ్ల క్రితం పాత పట్టాని చూపి బెదిరిస్తున్నారని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు.

సింహగిరిపై ఘనంగా పండిత సదస్సు

- అప్పన్న వైభవాన్ని కీర్తించిన పలు దేవస్థానాల వేద పండితులు
- వేణుగోపాలస్వామిగా దర్శనమిచ్చిన అప్పన్న



వేణుగోపాలస్వామి అలంకారంలో అప్పన్న

సింహాచలం: సింహగిరిపై జరుగుతున్న శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వార్షిక కల్యాణ మహోత్సవాల్లో భాగంగా నాల్గవరోజు గురువారం పండిత సదస్సు ఘనంగా జరిగింది. స్వామి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని వేణుగోపాలస్వామిగా అలంకరించి శ్రీదేవి, భూదేవి సమేతంగా కల్యాణమండపంలో వేదికపై కొలువుంచారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం జరిపారు. అనంతరం రాష్ట్రంలోని పలు దేవస్థానాల నుంచి వచ్చిన సుమారు 120 మంది వేద పండితులు తమ పాండిత్యంతో స్వామిని కీర్తించారు. నాలుగు వేదాల్లోని స్లోకాలతో స్వామిని కొలిచారు. స్వామి వైభవాన్ని వివరించారు. అనంతరం దేవస్థానం తరపున పండితులను సత్కరించారు. వేద పండితులు శ్యావాస మహర్షి ఘనాపాటి(విజయవాడ దేవస్థానం) పృధ్వి ఘనాపాటి(శ్రీశైలం), అన్నపూర్ణయ్య ఘనాపాటి(కాణిపాకం), యనమండ్ర సూర్యనారాయణ ఘనాపాటి(అన్నవరం), వెంకటేశ్వర ఘనాపాటి(కనకమహాలక్ష్మి దేవస్థానం), సింహాచలం దేవస్థానం వేదపండితులు సురేష్ ఘనాపాటి, జగన్‌మోహన్‌శర్మ తదితరులు పాల్గొన్నారు. దేవస్థానం స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత ఉదయం 7.30 నుంచి కల్యాణ ఉత్సవమూర్తుల చెంతన వైదిక సదస్యాన్ని నిర్వహించారు. సూపరింటెండెంట్లు జీవీవీఎస్‌కే ప్రసాద్, త్రిమూర్తులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

స్వర్ణ కవచ ధారునిగా అప్పన్న

కల్యాణోత్సవాల్లో భాగంగా గురువారం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి స్వర్ణ కవచ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చాడు. ప్రతి గురువారం మాత్రమే లభించే స్వర్ణ కవచ అలంకారాన్ని ఏటా వార్షిక కల్యాణోత్సవాల్లో పండిత సదస్యం రోజు కూడా చేయడం పరిపాటి. ఈసారి గురువారం రోజే పండిత సదస్సు రావడం విశేషం.

జెడ్పీ ఉన్నత పాఠశాలకు కంప్యూటర్ వితరణ



హెచ్ఎంకు కంప్యూటర్ అందజేస్తున్న లయన్స్ క్లబ్ నవ్య ప్రెసిడెంట్ శ్రీనివాసరావు, సభ్యులు

రోలుగుంట : నర్సీపట్నం లయన్స్ క్లబ్ నవ్య వారు గురువారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం ప్రసాద్‌కు కంప్యూటర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా క్లబ్ ప్రెసిడెంట్ శ్రీనివాసరావు మాట్లాడుతూ తమ క్లబ్ తరపున ఏటా ఈ విధమైన సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. తమ క్లబ్ సభ్యురాలు ఈ పాఠశాల ఇంగ్లిష్ టీచర్ పి.వి.ఎం నాగజ్యోతి అభ్యర్థన మేరకు పాఠశాలకు కంప్యూటర్‌ను అందించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సంఘ క్లబ్ సభ్యులు చైతన్య, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడి అరెస్ట్



నిందితుడు మహేష్‌ను మీడియా ముందు హాజరు పరిచిన డీఎస్పీ శ్రీనివాసరావు

నర్సీపట్నం : పట్టణంలోని అయ్యన్న కాలనీలోని జరిగిన హత్య కేసులో నిందితుడు చిత్రాడ మహేష్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని డీఎస్పీ పి.శ్రీనివాసరావు తెలిపారు. పట్టణ పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ వివరాలు వెల్లడించారు. నిందితుడిని అయ్యన్న కాలనీ జంక్షన్ చింతపల్లి రోడ్డులో ట్రైనీ డీఎస్పీ చైతన్య, సీఐ గోవిందరావు అదుపులోకి తీసుకున్నారన్నారు. అయ్యన్నకాలనీలో ఈ నెల 8వ తేదీన తలుపులమ్మ తల్లి పండగ సందర్భంగా ఏర్పాటు చేసిన స్టేజ్ ప్రోగ్రాం వద్ద మృతుడు రుత్తల దుర్గాప్రసాద్‌తో నిందితుడు మహేష్ గొడవ పడ్డాడని, అక్కడ విధి నిర్వహణలో ఉన్న తమ సిబ్బంది ఇద్దరికీ వార్నింగ్ ఇచ్చి పంపించేశారన్నారు. రాత్రి ఒంటి గంట సమయంలో నిందితుడు మహేష్ మళ్లీ దుర్గాప్రసాద్ ఇంటికి వెళ్లి గొడవపడ్డాడని, దుర్గాప్రసాద్ ఛాతిలో కత్తితో మూడుసార్లు పొడిచి చంపాడని తెలిపారు. మృతుడి స్నేహితుడు అడ్డుకొనే ప్రయత్నం చేయగా అతనిని కూడా గాయపరిచాడన్నారు. ఈ ఘటనలో నిందితుడిపై 75/2025యు/ఎస్103(1)బీఎన్ఎస్ యాక్టు కింద కేసు నమోదు చేశామన్నారు. నిందితుడిపై టౌన్ స్టేషన్‌లో మరో కేసు ఉందని, అతనిపై రౌడీషీట్ ఓపెన్ చేశామన్నారు. హత్యకు ఉపయోగించిన మారణాయుధాలను స్వాధీనం చేసుకున్నామన్నారు.

జాతీయ సెపక్ తక్రా పోటీలకు దేవరాపల్లి విద్యార్థి



జశ్వంత్‌ను అభినందిస్తున్న హెచ్ఎం పడాల్‌దాస్

దేవరాపల్లి: జాతీయ స్థాయి సెపక్ తక్రా పోటీలకు దేవరాపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థి తమటపు జశ్వంత్ ఎంపికయ్యాడు. ఈ నెల 15 నుంచి 20 వరకు మణిపూర్ రాష్ట్రంలోని ఇంపాల్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో జశ్వంత్ పాల్గొంటాడని స్థానిక ప్రధానోపాధ్యాయుడు, ఇన్‌చార్జ్ ఎంఈవో బి.పడాల్‌దాస్ తెలిపారు. ఇటీవల కర్నూల్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ఈ బాలుడు విశేష ప్రతిభ కనబరిచి సత్తా చాటాడు. ఈ రాష్ట్ర స్థాయి పోటీల్లో 13 జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొనగా కేవలం ఐదుగురు మాత్రమే ఎంపికయ్యారు. ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి తమ పాఠశాల విద్యార్థి జశ్వంత్ ఒక్కరే ఎంపిక కావడం ఆనందంగా ఉందని పడాల్‌దాస్ చెప్పారు. జస్వంత్ తోపాటు తర్ఫీదునిచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు బాబూరావును గురువారం స్థానిక హైస్కూల్లో హెచ్ఎం, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

ఆరోగ్యానికి మేలు.. తాటి ముంజులు



- వేసవి తాపానికి శరీర చల్లదానికి మేలు
- అనకాపల్లిలో జోరుగా అమ్మకాలు
- డజన్ ముంజులు రూ.50 నుంచి రూ.100

అనకాపల్లి: భానుడు ప్రతాపాన్ని చూపుతూ ప్రజలకు చెమటలు కక్కిస్తున్నాడు. ఈ క్రమంలో ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందేందుకు పలు దారులు వెతుక్కుంటున్నారు. ఉక్కపోతను తట్టుకునేందుకు, శరీరం డీహైడ్రేషన్ కాకుండా ఉండేందుకు తాటిముంజలను ఆశ్రయిస్తున్నారు. ఎన్నో ప్రయోజనాలు ఉన్న వీటికి డిమాండ్ ఏర్పడింది. అనకాపల్లి పట్టణంలో తాటి ముంజులు వ్యాపారం జోరందుకుంది.

ఏటా ఏప్రిల్, మే మాసాల్లో జిల్లాలో వివిధ గ్రామాల నుంచి అనకాపల్లి పట్టణానికి తాటిముంజులు తీసుకొచ్చి అమ్మకాలు సాగిస్తుంటారు. అనకాపల్లి పట్టణానికి అనకాపల్లి, కశింకోట, మునగపాక, చోడవరం, బుచ్చెయ్యపేట, దేవరాపల్లి మండలాల నుంచి రైతులు ఉదయం 8 గంటలకు ఆటోల్లో తీసుకుని వస్తారు. పట్టణంలో నర్సింగరావుపేట, ఉడ్‌పేట స్కూల్ రహదారి, వేల్పులవీధి శివాలయం జంక్షన్, పెరుగు బజార్ జంక్షన్, ఆర్టీసీ కాంప్లెక్స్ రహదారిలో వీటిని విక్రయిస్తుంటారు. తాటిముంజులు సైజును బట్టి డజన్ రూ.50 నుంచి రూ.100 వరకు అమ్ముతున్నారు. గ్రామాల్లో కొంతమంది రైతులు పొలాల్లో తాటిచెట్లకు ఉండే ముంజులు తక్కువ రేటుకు కొనుగోలు చేసుకుని వచ్చి పట్టణంలో అమ్మకాలు సాగిస్తారు. ఒక్కొక్క సెంటర్ వద్ద ముగ్గురు లేదా నలుగురు వ్యక్తులు గుంపులుగా వ్యాపారం చేస్తారు. మండుటెండలో తాటి ముంజులు తినడంతో శరీరంలో ఉష్ణోగ్రతను చల్లబరుస్తుంది.

తాటి ముంజులతో ప్రయోజనాలు

- వేసవిలో లభించే అద్భుతమైన ప్రయోజనాలు ఆందించేవి తాటి ముంజులు, దీన్నే ఐస్ ఆపిల్ అంటారు.
- రక్తంలో చక్కెర పెరుగుదలని నివారిస్తుంది. మధుమేహులకు వేసవిలో మంచి పోషకాలనిచ్చే పండు.
- ఐస్ ఆపిల్స్‌లో కేలరీలు తక్కువగా ఉన్నప్పటికీ కాల్షియం, ఫైటోన్యూట్రియెంట్లు, విటమిన్లు పుష్కలంగా ఉంటాయి.
- విటమిన్ ఏ, సి, బి7 పుష్కలంగా ఉన్నాయి. కేలరీలు పెంచకుండా రోగనిరోధక శక్తిని బలోపేతం చేస్తుంది.
- యాంటీ ఇన్ఫ్లమేటరీ, యాంటీ ఆక్సిడెంట్ లక్షణాలతో పాటు ఫైటో న్యూట్రియెంట్స్ ఫ్రీ రాడికల్స్‌తో పోరాడేందుకు సహాయపడతాయి.
- వృద్ధాప్య ఛాయలను తగ్గిస్తాయి. ముఖం మెరిసేలా చేస్తుంది, దద్దుర్లు వంటి చర్మ సమస్యలను దూరం చేసుకోవచ్చును.
- మొటిమలు, మచ్చలు, ముడతలు రాకుండా కాపాడుతుంది. వేసవి ఉష్ణోగ్రతల నుంచి ఉపశమనం కలిగిస్తుంది.

వేసవి తాపానికి తాటి ముంజులు



గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణానికి తీసుకొచ్చిన తాటి ముంజులు తినడం వల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. ముఖ్యంగా వేసవి అధిక ఉష్ణోగ్రతలతో తాళలేని ప్రజలకు తాపం తీర్చుతాయి. శరీరం చల్లబడుతుంది. మంచి పోషకాలు ఉంటాయి.

– వేగి త్రినాథ్, గవరపాలెం, అనకాపల్లి

ధర ఎక్కువైనా కొనుగోలు



గత ఏడాది కంటే ఈ ఏడాది డజన్ తాటి ముంజులు రూ.20 అదనంగా పెరిగాయి. అయినప్పటికీ కొనుగోలు చేసి తింటున్నాం. వేసవి ఉష్ణోగ్రతలను తట్టుకోవడంలో తాటి ముంజులు ఎంతగానో ఉపయోగపడతాయి.

– సాయి, అనకాపల్లి

ఇద్దరం కష్టపడితే రోజుకు రూ.700 మిగులు

చోడవరం మండలం గోవాడ నుంచి ఏటా ఏప్రిల్‌లో రైతులు పొలాల్లో తాటి ముంజులు కొనుగోలు చేసి, ఆటోలో అనకాపల్లి పట్టణానికి తీసుకొస్తుంటాను. ఇక్కడ నర్సింగరావుపేటలో బీఎస్ఎన్ఎల్ కార్యాలయం రహదారిలో ఉదయం 9 గంటలకు వ్యాపారం చేస్తాను. వాతావరణం చల్లబడితే వ్యాపారం ఉండదు. 10 సంవత్సరాలు వ్యాపారం చేస్తున్నాను. ప్రస్తుతం ఇద్దరిమి కష్టపడితే రోజుకు రూ.700 మిగులుతోంది.

– సూరి అప్పారావు, చోడవరం

దీర్ఘకాలిక వ్యాధులకు ఉచిత ఆయుర్వేదం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న వైద్యురాలు లావణ్య, గర్భిణులు, చిన్నారులు

అనకాపల్లి: దీర్ఘకాలిక వ్యాధులకు ప్రభుత్వమే ఆయుర్వేద మందులు ఉచితంగా అందజేస్తుందని ఎన్టీఆర్ ఆస్పత్రి ఆయుర్వేద విభాగం వైద్యురాలు కె.లావణ్య తెలిపారు. ఈ నెల 8 నుంచి 23వ తేదీ వరకూ నిర్వహించే పోషణ పక్వాడలో భాగంగా గురువారం సత్యనారాయణపురం ఎలిమెంటరీ పాఠశాలలో విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ఆయుర్వేదంపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ తల్లి గర్భంలో శిశువు ఉన్నప్పటి నుంచి వెయ్యి రోజుల ప్రణాళికలలో భాగంగా తీసుకోవలసిన జాగ్రత్తలపై పలు సూచనలు ఇచ్చారు. గర్భిణులు, బాలింతలకు, అంగన్‌వాడీ చిన్నారులకు, పోషక ఆహారం, ఆరోగ్య సమస్యలపై దృష్టి సారించాలన్నారు. అనంతరం యోగాసనాలు చేయించారు. కార్యక్రమంలో ఆయుర్వేద విభాగం ఉద్యోగి కె.రాము, యోగా శిక్షకురాలు ఎ.చంద్రిక, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

స్థిరంగా కూరగాయల ధరలు

కశింకోట: స్థానిక వారపు సంతలో గురువారం కూరగాయల ధరలు దాదాపు స్థిరంగా ఉన్నాయి. కిలో టమాట రూ.20, ఉల్లి, బంగాళదుంప, క్యాబేజి రూ.30, క్యారెట్, బీట్రూట్, చామదుంప, వంకాయ రూ.40, బెండకాయ రూ.60, బీరకాయ, క్యాప్సికం రూ.80, వెల్లుల్లి రూ.వందకు విక్రయాలు సాగాయి. ఆనపకాయ పరిమాణం అనుసరించి రూ.20 నుంచి రూ.40 వరకు విక్రయించారు.

క్లుప్తంగా

నూకాంబికకు ప్రత్యేక పూజలు



అమ్మవారిని దర్శించుకున్న సూరిబాబు దంపతులు

అనకాపల్లి: ఉత్తరాంధ్ర ఇలవేల్పు గవరపాలెం నూకాంబిక అమ్మవారిని చెన్నైకి చెందిన ఫైజర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ అధికారి కె.సూరిబాబు దంపతులు గురువారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సూరిబాబు దంపతులకు అమ్మవారి చిత్రపటాన్ని, ప్రసాదాన్ని ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ పీలా నాగశ్రీను అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పన్ను తగ్గించాలని డిమాండ్



కోటేశ్వరరావు

అనకాపల్లి టౌన్: పట్టణాల్లో పెంచిన ఇంటి పన్ను తగ్గించాలని, ఆస్తి విలువ ఆధారిత ఇంటి పన్ను విధానం రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఇప్పటికే పెరుగుతున్న ధరలతో సతమతమౌతున్న ప్రజలపై ఇంటి పన్ను పెంచి వారిపై పెనుభారం మోపడం అన్యాయమన్నారు. పట్టణాలలో ఇంటి పన్ను గత సంవత్సరంతో పోలిస్తే 15 శాతం పెరిగిందన్నారు. ఫలితంగా 320 కోట్ల రూపాయల భారం ప్రజలపై పడుతుందన్నారు. ఎన్నికలలో కూటమి పార్టీలు ఆస్తి విలువ ఆధారిత పన్ను విధానాన్ని సమీక్షిస్తామని, పన్నులు పెంచబోమని మేనిఫెస్టోలో పొందుపరిచారన్నారు. ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు విలువ ఆధారిత ఆస్తి పన్ను విధానాన్ని రద్దు చేయాలని, పెంచిన ఇంటి పన్నును ఉపసంహరించుకోవాలని కోరారు.

రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద నిలిచిన వర్షపు నీరు



విజయరామరాజు పేట రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద నిలిచిపోయిన నీరు

అనకాపల్లి టౌన్: మండుతున్న ఎండలతో అల్లాడిపోయిన జనం ఒక్కసారిగా కురిసిన వర్షంతో ఉపసమనం పొందారు. గురువారం సాయంత్రం ఐదు నుంచి ఆరు గంటల వరకు పట్టణంలో భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం వరకు 35.3 డిగ్రీల సెల్సియస్‌తో ఎండ మండిపోగా, ఆ తర్వాత ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమైంది. ఈదురుగాలుతో వాతావరణం అంతా చల్లబడింది. గంటకు పైగా కురిసిన వర్షంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. విజయరామరాజు పేట రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద నీరు చేరడంతో అటువైపుగా వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. 15.0 ఎం.ఎం వర్షం కురిసిందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

కశింకోట: జెట్టపురెడ్డితునిలోని మజ్జి వారి వీధిలో జాతీయ ఉపాధి హామీ పథకం కింద మంజూరైన రూ.8 లక్షలతో సిమెంట్ రోడ్డు నిర్మాణాన్ని గురువారం ప్రారంభించారు. నరసింగబిల్లి పీఏసీఎస్ మాజీ ఉపాధ్యక్షుడు మజ్జి కన్నబాబు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు మజ్జి నిరంజన్‌కుమార్, పాల సంఘం అధ్యక్షుడు కసిరెడ్డి కన్నయ్య, పంచాయతీరాజ్ వర్క్స్ ఇన్‌స్పెక్టర్ మహేష్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు నేడు

అనకాపల్లి: స్థానిక కన్యకాపరమేశ్వరి దేవాలయం ఆవరణలోని అయ్యప్పస్వామి ఆలయంలో స్వామివారి జన్మనక్షత్రం పురస్కరించుకుని శుక్రవారం వేకువజాము నుంచి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రతినిధి కటకం లక్ష్మణరావు తెలిపారు. ఉదయం 6 గంటలకు స్వామివారికి చక్రస్నానం, మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహిస్తామన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు గురువారం 2,707 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ఠ ధర	గరిష్ఠ ధర
మొదటి రకం	3,700	4,250
రెండో రకం	3,150	3,850
మూడోరకం	2,830	3,140

అనకాపల్లి సినిమాలు

రాజా : మాడ్ స్క్వేర్
సత్యనారాయణ స్క్రీన్-1 : గుడ్ బ్యాడ్ అగ్లీ
సత్యనారాయణ స్క్రీన్-2 : రాజుగారి దొంగలు
పర్తిసాయి : కోర్టు
షిర్డీసాయి: అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి
వెంకటేశ్వర : చెరసాల
శ్రీసత్య : సంక్రాంతికి వస్తున్నాం.
రామచంద్ర : జాక్

గ్రామీణ స్థాయి నుంచి పార్టీ బలోపేతం



పార్టీ శ్రేణులతో మాట్లాడుతున్న మలసాల భరత్‌కుమార్

అనకాపల్లి: గ్రామీణ స్థాయి నుంచి పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్ కుమార్ కోరారు. స్థానిక రింగ్‌రోడ్డు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి అధికారం చేపట్టి పది నెలలు దాటినా సూపర్ సిక్స్ పథకాలను బడుగు, బలహీన వర్గాల వారికి అమలు చేయడంలో విఫలమైందన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో ఏటా అనేక సంక్షేమ పథకాలు పొందేవారని, నేటి పాలనలో వాటిలో ఏ ఒక్కటీ లేదన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు వేగి త్రినాథ్, కశింకోట మండల అధ్యక్షుడు మలసాల కిషోర్, గవర కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ బొడ్డేడ శివ, పార్టీ నాయకులు ఎం.శ్రీనివాసరావు, గైపూర్ రాజు, బుద్ధ శ్రీను, దాడి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

పోరాట యోధుడు కామ్రేడ్ రామునాయుడు



కామ్రేడ్ దొడ్డి రామునాయుడు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

అనకాపల్లి: ఉమ్మడి విశాఖ జిల్లాలో కార్మికుల ఉద్యమానికి కామ్రేడ్ దొడ్డి రామునాయుడు ఊపిరి పోశారని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు కె.లోకనాథం తెలిపారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో కామ్రేడ్ దొడ్డి రామునాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పుచ్చలపల్లి సుందరయ్య ప్రోద్బలంతో ఉమ్మడి విశాఖ జిల్లాలో సీపీఎం విస్తరణకు దొడ్డి రామునాయుడు విశేష కృషి చేశారన్నారు. తుది శ్వాస వరకూ తాను నమ్మిన సిద్ధాంతం కోసం పరితపించారన్నారు. నిరుపేదగా జీవితాన్ని గడుపుతూనే కేన్సర్‌కు గురైనా భయపడకుండా పార్టీ బలోపతానికి కృషి చేసి మహానేత అన్నారు. విద్యార్థి ఉద్యమాన్ని నిర్మించడంలో కృషి చేస్తూనే, కామ్రేడ్ ఎ. బాలకష్ణ, మళ్ల సత్యనారాయణ లాంటి నేతలను తయారు చేశాడన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గంటా శ్రీరామ్, జిల్లా కమిటీ సభ్యులు అల్లు రాజు, నాయకులు కె. ఈశ్వరరావు, కె. తెల్లయ్యబాబు, నూకఅప్పారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ తీగలు తగిలి మేకల మృతి



కరెంట్ వైర్లు తగిలి మృతి చెందిన మేకలు

అనకాపల్లి టౌన్: మండలంలోని ఊడేరులో కరెంటు తీగలు తగలడంతో రెండు మేకలు మృతి చెందాయి. ఇక్కడ సర్వే నంబర్ 211 జగదాంబ క్వారీ యాజయాన్యం అక్రమంగా వేసిన కరెంట్ పోల్స్‌కు ఉండే వైర్లు అటుగా మేతకు వెళ్లిన మేకలకు తగిలి మృతి చెందాయని జిలా గొర్రెల పెంపకందారుల సహకార శాఖ యూనియన్ చైర్మన్ గంటా శ్రీరామ్ వాపోయారు. క్వారీల యజమానుల ఆగడాలు రోజు రోజుకు మితిమీరిపోతున్నాయన్నారు. మైనింగ్, పోలీస్, రెవెన్యూ, ఎలక్ట్రిసిటీ అధికారులు ఉదాసీనంగా వ్యవహరించడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుందన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కాళ్ల తేలయ్యబాబు, జమ్మి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ స్థలం విక్రయిస్తే అడ్డుకుంటాం



ఏపీటీఎఫ్‌కు కేటాయించిన స్థలాన్ని పరిశీలిస్తున్న నాయకులు

బుచ్చెయ్యపేట : మేజర్ పంచాయితీ వడ్డాదిలో ఏపీటీఎఫ్ సంఘానికి కేటాయించిన స్థలాన్ని విక్రయించాలని చూస్తే అడ్డుకుంటామని గ్రామ నాయకులు తెలిపారు. మేజర్ పంచాయతీ వడ్డాది దొరబాబు కాలనీలో అప్పటి ఏపీటీఎఫ్ సంఘ నాయకుడు ఉపాధ్యాయుడు వెలంపూడి సత్యనారాయణ కోరిక మేరకు 1999లో సర్వే నంబర్ 49లో 3 సెంట్ల స్థలాన్ని సంఘ భవనానికి కేటాయించారన్నారు. ఈ స్థలాన్ని గురువారం గ్రామనాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ 25 ఏళ్లుగా సంఘ భవనం నిర్మాణం జరగకపోవడంతో స్థలం ఖాళీగా ఉందన్నారు. ఈ స్థలాన్ని ఇటీవల ఏపీటీఎఫ్ సంఘ నాయకులు కొంతమంది గ్రామ పంచాయతీకి, గ్రామ నాయకులకు తెలియకుండా విక్రయించాలని చూస్తున్నారని ఆరోపించారు. సంఘానికి భవనం కడతామంటే స్థలం కేటాయించాం తప్ప అమ్మకానికి కాదని, ఎవరైనా సంఘ భవనం స్థలం అమ్మినా, కొన్నా చెల్లుబాటు కాదని ఉప సర్పంచ్ దాడి సూరినాగేశ్వరరావు, నాయకులు దొండా నరేష్, అడపా నరసింహమూర్తి, సయ్యపురెడ్డి సత్యనారాయణ, మాధవరావు, కోవెల వెంకటర రమణ, తలారి శంకర్, కనక, సూరిబాబు తదితరులు స్పష్టం చేశారు. విద్యార్థులకు పాఠాలు బోధించే ఉపాధ్యాయులు అందరికీ ఆదర్శంగా, సంఘ సేవకుల్లా ఉండాలి తప్ప రాజకీయాలు చేయడం తగదన్నారు. ఏపీటీఎఫ్ సంఘానికి కేటాయించిన స్థలంలో సంఘ భవనం కట్టాలి.. లేదంటే పంచాయతీకి తిరిగి స్థలం స్వాధీనం చేసుకుంటామన్నారు.

ఘనంగా శారదా సత్యమాంబ ఆలయ వార్షికోత్సవం

కశింకోట: స్థానిక శారదానది ఆవల వంతెన వద్ద వెలసిన శారదా సత్యమాంబ ఆలయ దశమ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు, భక్తులు, ఇటుకల బట్టీల నిర్వాహకులు ఎక్కువ సంఖ్యలో అమ్మవారిని దర్శించి పూజలు చేశారు. చీరలు, రవికెలు, అరటి గెలలు, పండ్లు వగైరా రూపంలో అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం పెద్ద ఎత్తున అన్న సమారాధన నిర్వహించారు.

పట్టణంలో 'మినరల్' దోపిడీ

అనకాపల్లి: వేసవి నేపథ్యంలో పట్టణంలో మినరల్ వాటర్ ప్లాంట్ల నిర్వాహకుల దోపిడీ మొదలైందని ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా ఇన్‌చార్జి కొణతాల హరనాథ్‌బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల ఆరోగ్యాలతో వ్యాపారులు చెలగాట మాడుతున్నారన్నారు. 20 కంపెనీల వాటర్ బాటిల్స్‌లో తాగునీరు సురక్షితమో కాదో తెలియడం లేదన్నారు. దీనిపై జిల్లా అధికారం యంత్రాంగం పట్టించుకోకపోడం అన్యాయమన్నారు. జీవీఎంసీ జోనల్ కార్యాలయంలో హెల్త్ అధికారి లేకపోవడంతో వల్ల వాటర్ ప్లాంట్ల వ్యాపారులకు మంచి అవకాశం కుదిరిందన్నారు. కొంత మంది ఖాళీ వాటర్ బాటిళ్లు కొనుగోలు చేసి వారి ఇళ్లలో తాగునీటిని నింపి దుకాణాలకు తక్కువ ధరకు అమ్ముతున్నారన్నారు.

భవిత కేంద్రానికి సామగ్రి వితరణ



దివ్యాంగులకు హెల్దీ స్నాక్స్ అందిస్తున్న ఎంపీపీ వెంకటపద్మలక్ష్మి శ్రీనివాసరావు

పరవాడ: స్థానిక భవిత కేంద్రంలో దివ్యాంగులకు పీవై నాయుడు అండ్ కో కంపెనీ సొంత నిధులు రూ.25 వేలతో సమకూర్చిన వస్తువులను పరవాడ ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మి శ్రీనివాసరావు, సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు గురువారం అందజేశారు. ఎంపీపీ మాట్లాడుతూ భవిత కేంద్రంలో చదువుతున్న దివ్యాంగులను ఆదుకోవడానికి స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని కోరారు. మండల విద్యాశాఖ అధికారి సాయిశైలజ, స్థానిక నాయకులు పైల రామచంద్రరావు, రెడ్డి శ్రీనివాసరావు, టి.వెంకటరావు, సీహెచ్ కనకారావు, పైల హరీష్, రాంకీ హెచ్ఆర్ గిరిధర్ బక్షి పాల్గొన్నారు.

విద్యార్థి దశలోనే ఉన్నత శిఖరాలకు ప్రణాళిక



విద్యార్థులకు శక్తిటీమ్‌పై అవగాహన కల్పిస్తున్న ఏఎస్ఐ మణికుమారి

అనకాపల్లి: విద్యార్థి దశ నుంచి ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని రూరల్ ఏఎస్ఐ మణికుమారి తెలిపారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గురువారం దిబ్బపాలెం జెడ్పీ ఉన్నత హైస్కూల్లో శక్తి టీమ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈవ్‌టీజింగ్, పోక్సో చట్టం, బాల్య వివాహాలు-నష్టాలు, గుడ్ టచ్-బ్యాడ్ టచ్ అంశాలపై ఆమె వివరించారు. విద్యార్థి దశ నుంచి చెడు అలవాట్లకు బానిస కాకుండా ఉండాలన్నారు. సమాజంలో మంచి, చెడులను పరిశీలించుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు కృషి చేయాలన్నారు. ఇటీవల కొంతమంది విద్యార్థులు చెడు అలవాట్లుకు బానిసై బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారని వాపోయారు. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని కోరారు. ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలను శ్రద్ధగా చదువుకుని ఉన్నత అవకాశాలకు పునాదులు వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం. జి.ఉమామహేశ్వరరావు, కానిస్టేబుల్ టి.పుష్పలత, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ఆర్టీసీ ఉద్యోగుల నిరసన



డిపో గేటు వద్ద నిరసన తెలియజేస్తున్న అసోసియేషన్ జిల్లా కార్యదర్శి సుధాకర్

అనకాపల్లి: ప్రజా రవాణా శాఖ అధికారులు(ఆర్టీసీ) ఉద్యోగులపై వేధింపులు ఆపాలని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న అధికారులపై ఉన్నత స్థాయి అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని ప్రజా రవాణా శాఖ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ డిమాండ్ చేశారు. స్థానిక డిపో గేటు వద్ద గురువారం మధ్యాహ్నం భోజన విరామం సమయంలో ఉద్యోగులు నిరసనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ భద్రతా సర్క్యులర్ 1/2019ను, నాలుగు సంవత్సరాలుగా ఆగిపోయిన ప్రమోషన్లతోపాటు ఈహెచ్ఎస్ స్థానంలో పాత వైద్య విధానాలు అమలు చేయాలని, అక్రమ సస్పెన్షన్లు, రిమూవర్స్ ఆపాలని, గ్యారేజీ ఉద్యోగులు, నాన్ ఆపరేషన్ ఉద్యోగుల అపరిష్కృత సమస్యలను పరిష్కరించాలని, మహిళా ఉద్యోగులకు ప్రభుత్వ జీవో ప్రకారం పిల్లల సంరక్షణ సెలవులు మంజూరు చేయాలని, ఎలక్ట్రిక్ బస్సులను ప్రభుత్వం ద్వారా లేదా సంస్థ ద్వారా మాత్రమే కొనుగోలు చేయాలని, పదవీ విరమణ ఉద్యోగుల దంపతులకు సూపర్ లగ్జరీ బస్సులలో ఉచిత ప్రయాణం అనుమతించాలని తదితర డిమాండ్లతో నిరసన తెలియజేశారు.

అకస్మాత్తుగా వర్షం



తడిసి ముద్దయిన కశింకోట వారపు సంత



కశింకోట జాతీయ రహదారిపై కురుస్తున్న వర్షం

కశింకోట: మండల కేంద్రంలో గురువారం సాయంత్రం అకస్మాత్తుగా వర్షం కురిసింది. వారపు సంత తడిసి ముద్దయింది. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. ప్రజలు ఇబ్బంది పడ్డారు. అకస్మాత్తుగా ఆకాశం దట్టంగా మేఘావృతమై సుమారు ముప్పావు గంట పాటు వర్షం కురిసింది. దీంతో రోడ్లపై నీరు పారింది. కశింకోట వారపు సంతలో వ్యాపారులు, కొనుగోలుదారులు వర్షంలో తడిసి ముద్దయ్యారు. వర్షం తగ్గిన తర్వాత కూరగాయలు, మసాలా దినుసులు, పండ్లు, ఆకు కూరలు వగైరా కొనుగోలు చేశారు. సరిగ్గా ఎక్కువ మంది ముమ్మరంగా కొనుగోలు చేయడానికి వచ్చే సమయంలోనే వర్షం కురిసి అమ్మకాలను దెబ్బతీసి నష్టం కలిగించిందని వ్యాపారులు వాపోయారు. కొనుగోలు చేసే వారు ఎక్కువ మంది రాకపోవడం వల్ల కూరగాయలు, ఇతర సరుకులు అమ్మకం కాకుండా ఉండిపోయాయని, వాటిని తిప్పి ఇళ్లకు తీసుకెళ్లలేక తక్కువ ధరకు నష్టానికి విక్రయించాల్సి వచ్చిందని ఆవేదన చెందారు. వర్షం కారణంగా గంటన్నర పైగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. ఆ తర్వాత విద్యుత్ సరఫరాను పునరుద్ధరించడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. వర్షం పడినప్పటికి ఇంకా ఉక్కపోత ఉండటంతో ప్రజలు సతమతమయ్యారు.

తుమ్మపాల: మండలంలో గురువారం సాయంత్రం ఏకధాటిగా వర్షం కురిసింది. ఆకాశంలో ఒక్కసారిగా మబ్బులు కమ్ముకుని సుమారు గంట పాటు వర్షం పడింది. జనజీవనం ఎక్కడికక్కడ స్తంభించిపోయింది. సుదూర ప్రాంతాలు ప్రయాణించే ద్విచక్ర వాహనదారులు మార్గమధ్యంలో నిలిచిపోయారు. రోడ్లపై నుంచి వర్షపు నీరు పారింది. వేసవి దుక్కులకు సరిపడా వర్షం కురవడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వరి పొలాల్లో వేసిన పశువుల గెత్తం చల్లుకుని దుక్కులు చేసుకునేందుకు సిద్ధమవుతున్నారు. మండలం, పట్టణ ప్రాంతాల్లో టమాటా రైతులు కాస్త ఇబ్బంది పడ్డారు. పైర్లు, ఇతర వేసవి పంటలకు అనుకూలమైన వాతావరణం ఏర్పడింది.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



వేపగుంటలో విద్యార్థులతో కలిసి వాహనదారులకు అవగాహన కలిగిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ నరసింగరాజు

పెందుర్తి: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని వెస్ట్ జోన్ ట్రాఫిక్ విభాగం ఎస్ఐ నరసింగరాజు అన్నారు. పెందుర్తి, సుజాతనగర్, వేపగుంట కూడళ్ల వద్ద గురువారం ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడిపితే రూ.10 వేలు జరిమానా విధిస్తామన్నారు. హెల్మెట్, కారు సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరి సహకారం అవసరం అని కోరారు. పూర్తిస్థాయిలో అవగాహన లేని తల్లిదండ్రులకు పిల్లలు ట్రాఫిక్ నిబంధనల పట్ల అవగాహన కలిగించాలని సూచించారు. పలు విద్యాసంస్థల విద్యార్థులు ప్లకార్డులు పట్టుకుని ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు.